ఆఖరి ఆకు

కంఠంనేని రాధాకృష్ణమూర్తి

అన్ని నగరాల్లోలాగే ఆ నగరంలో కూడా ఇవన్నీ వున్నాయి: రైల్వే స్టేషను. పోలీసుస్టేషను ప్రైయివేటు కారులు. రిక్షాలు. సైకిళ్ళు. భవనాలు పూరిళ్ళు. జుట్టు పెంచిన ఆఫీసర్లు. బొచ్చు పెరిగిన జాతి కుక్కలు. కొళాయిలు. మురుగు కాలువలు. పోలీసులు. ముష్టివాళ్ళు. విద్యార్థులు. నేల టిక్కెట్టు ప్రేక్షకులు. పత్రికా ఆఫీసులు. వ్యభిచార గృహాలు. డాక్టర్లు రౌడీలు. సాములు. మంత్ర సానులు. రాజకీయాల్లో పొర్లే నాయకులు. పెంటలు తినే పందులు. ఆర్టిస్టులు. బిచ్చగాళ్ళు. పతివ్రతలు. భూత వైద్యులు గ్రంథాలయాలు. దేవాలయాలు ఇల్లాంటివన్నీ...

కాని ఇవన్నీ అందరికీ అన్ని సమయాల్లోనూ అవసరపడవు. కొందరికి కొన్ని కొన్ని సమయాల్లోను. ఇంకొందరికి ఇంకొన్ని అన్ని సమయాల్లోనూ అవసరపడుతుండటం జరుగుతుంది. ఆ నగరంలో ఓ మూల మురికివాడలో ఒక పాత మిద్దె రెండో అంతస్థులో చౌకగా దొరికిన రెండు గదుల వాటా ఒకటి శారదకి, రజనీకి కలిసి అవసరమైంది.

శారద, రజనీలు, యిద్దరూ ఆర్టిస్టులు. జంట కవుల్లాంటి జంట ఆర్టిస్టులు. 'శారజ' అన్న పేరుతో బొమ్మలు గీస్తుంటారు. పెద్దగా పేరుగలవాళ్ళేమీ కాదుగాని ఆర్టిస్టులుగా ఏదో సాధించాలన్న తపన కలవాళ్ళు. శారద స్వగ్రామం తెనాలి. రజని స్వగ్రామం నెల్లూరు. సహజంగా ఇద్దరు ఆడవాళ్ళకు పొత్తు కుదరటం అసంభవం అంటారు. కాని ఒకోసారి అసంభవాలు సంభవాలుగా మారుతుంటాయి. ఆర్టు విషయంలోను వంకాయ పులుసు వంటకంలోను, బ్రానరీ సెలక్షన్‌లోను చీరకట్టు తీరులోను ఆ యిరువురి అభిరుచులూ ఏకం కావటం వల్ల వాళ్ళిద్దరూ ఒకే ఇల్లు తీసుకోవటమూ, జాయింటుగా స్టూడియో స్థాపించటమూ, సంభవించింది. సాధ్యపడిందీను.

ఇదంతా ఉత్త ఉపోద్ఘాతం అనవొచ్చు ఇక.

ఆ నవంబరు మాసంలో ఆ నగరంలో ఒక క్రొత్త వ్యక్తి ప్రవేశించాడు అతను అక్కడి సందుల్లోను, గొందుల్లోను మూల మూలల వెతుకుతూ ఇక్కడో మనిషిని. అక్కడో వ్యక్తినీ తన చల్లని ప్రేళ్ళతో తాకుతూ తిరగటం ప్రారం

భించారు. డాక్టర్లు అతన్ని 'న్యుమోనియా' అన్నారు. నగరపు తూర్పు వేపు ఇరుకు, మురికి, గొందుల గలీజుల్లో అతను కాస్త రొమ్ము విరుచుకుని తనకు 'ఎర'గ దొరికిన మనుషుల మీద తన చిహ్నాన్ని ముద్రిస్తూ చిన్నగ అడుగులు వేస్తూ కదల సాగాడు.

ఈ 'న్యుమోనియా' అన్న పెద్ద మనిషి మీరనుకున్నంతటి సాహసికుడేమీ కాదు. డొక్కలంటుకు పోయి తిండిలేక చిక్కిన ఏ అర్థికాసమర్థుడైనా నిరుద్యోగ యువకుడో, లేక పిల్లల్ని కనీ కనీ రొమ్ములెండుకుని, రక్తలేమి వల్ల పాలిపోయి ఇష్టం లేకపోయినా తప్పని సరై భర్తకు శరీరాన్నర్పిస్తున్న ఏ అసహాయ యువతో చాలు అతని ప్రతాపానికి. కాని చిత్రమేమిటంటే అతను రజని మీద కూడ తన కొరడాను విదిలించటం! కదలలేక మంచపు కుక్కి మధ్య పడుకుని ఎదురుగా కిటికీలో నుండి అవతలి పెంకుటింటి ఆవరణలోకి చూస్తూ పడుకుని ఉందామె!

ఆ రోజు ఉదయం డాక్టరు శారదను మెట్ల మీదకి పిలిచాడు.

"మొత్తం ఛాన్సుల్ని వంద క్రింద తీసుకుంటే." చేతిలోని థర్మామీటరును విదిలించుతూ అన్నాడాయన. "మీమిత్రురాలికి ఇంకొక్క ఛాన్సు మాత్రం ఉంది. ఆ ఒక్క అవకాశం కూడా ఆమెకు జీవితం మీద ఉన్న ప్రేమను బట్టి ఆధార పడి ఉంటుంది. ఈ ఒక్క మార్గం ద్వారానే మనుషులు ఒకోసారి మెడిసన్‌ను హేళన చేస్తుంటారు. అసలు సంగతి చెప్పాలంటే మీమిత్రురాలు తనిక బ్రతకబోవటం లేదని నిశ్చయం చేసేసుకుంది సరేగాని, మనలో—మాట ఆమె మనసులో వేరే ఏదయినా ఉద్దేశమంటావా?"

"ఆమెకా?" సాలోచనగా, అన్నది శారద. "అవును. ఏనాటికయినా హిమాలయాన్ని పెయింటు చేయాలని మాత్రం పెద్ద ఆశయముంది"

"చిత్ర లేఖనమా—టట్! అదికాదు నేననేది, రెండుసార్లు ఆలోచింప జేసేంతటి విషయమేదైనా-మాట వరసకి ఎవరైనా యువకుడు?"

చిత్రంగా కళ్ళు పెద్దవి చేసి చూసింది శారద.

"ఏమిటీ? ఒక యువకుడికి ఆ మాత్రం అర్హత - లేదు డాక్టర్ ఆమె విషయంలో అట్లాంటిదేమీ లేదు."

"సరే అయితే." డాక్టరు అన్నాడు. "అది బలహీనతల్లే ననుకుందాము. నా ప్రయత్నాల ద్వారా సైన్సు చేయగలిగిందంతా చేసి చూస్తాను. కాని ఒకటి నా పేషెంటు ఎవరైనా తన మరణం తర్వాత ఎంతమంది కన్నీళ్ళు కార్చేవారున్నారా అని యోచించటం ప్రారంభించిందని తెలిస్తే మాత్రం యాభయి శాతం ఆశ వదులుకుంటాను. కాక ఆమె ఏ సినిమాతార జుత్తు స్టైలును గురించో ఆలోచిస్తుందని తెలిస్తే, ఆమె కోలుకునే విషయంలో వందింటికి ఒకటి బదులు రెండు ఛాన్సుల్ని లెక్కలోకి తీసుకుంటాను."

డాక్టరు వెళ్ళిపోయాక శారద హాలులోకి నడిచింది. డ్రాయింగు బోర్డు తీసుకుని చిన్నగ కూనిరాగం తీస్తూ అవతలి

గదిలోకి వెళ్ళింది. ఆ గదిలో దుప్పటి క్రింద ఒక్క కదలికన్నా లేకుండా, మొహం కిటికీవేపు తిప్పుకుని రజని పడుకుని వుంది. ఆమె నిద్రపోతుందనుకుని శారద తన కూనిరాగాన్ని కట్టిపెట్టేసింది.

టేబుల్ మీద బోర్డుని వుంచి దానికొక డ్రాయింగు కాగితాన్ని అమర్చి బొమ్మ గీయటం ప్రారంభించింది ఆమె. ఒకటి రెండు వార పత్రికల్లో కథలకి కార్టూనులకి బొమ్మలు గీస్తుంటారువాళ్ళు.

బొమ్మ గీస్తున్న సమయాన ఒక స్వరం గొణుగుతున్నట్టుగా పదే పదే వినిపించటంతో శారద చప్పున మంచం వద్దకు నడిచింది.

రజని కళ్ళు రెండూ తెరుచుకుని వున్నాయి. కిటికీలోంచి బయటికి చూస్తూ

ఆమె ఏమిటో లెక్క పెడుతోంది. వెనక వేపుకు.

"పన్నెండు." ఆమె నోట్లోంచి వెలువడింది. కొద్ది సేపయాక, 'పదకొండు'. ఆ తర్వాత, 'పది. తొమ్మిది.' వెంటనే 'ఎనిమిది. ఏడు.' ఇలా చివర్లోని త్వర త్వరగా చదివిందామె.

శారద సాలోచనగా కిటికీలోంచి బయటికి చూసింది. ఏమున్నాయక్కడ లెక్క పెట్టటానికి? ఈ మిద్దెకు అవతలివేపు ఒక ఇరవై గజాల ఖాళీస్థలం తర్వాత ఉన్న పెంకుటింట పెరటిలో గోడమీదికి పాకి పరుచుకుని ఉండు ద్రాక్షతీగ. దాని వయస్సెంతుంటుందో చెప్పలేము. ఎండిన తీగలతో దాదాపు ఒక అస్థిపంజరంలా కనిపిస్తోంది.

"ఏమిటి రజనీ?" అడిగింది శారద.

"ఆరు." రజనీ అన్నది గొణుగుడు స్వరంతో "ఇప్పటివి తొందరగా పడి పోతున్నాయి. మూడు రోజుల క్రితం వంద దాకా ఉన్నాయి లెక్క పెట్టటానికి వచ్చేదాన్ని...ఇప్పుడయితే తేలికగ ఉంటుంది. అదుగో యింకొకటి పడిపోయింది. ఇప్పుడింక అయిదు మాత్రం మిగిలాయి."

"ఏమిటే అవి? నాకు చెప్పవూ?"

"ఆకులు. ఆ ద్రాక్ష ఆకులు. ఆ ఆఖరి ఆకు రాలి పోయిందంటే ఇక నాకూ పిలుపొచ్చిందన్న మాట మూడు రోజుల్నించీ నాకీ సంగతి తెలుస్తోంది. డాక్టరు మట్టుకు చెప్పలేదా నీకు?"

"అట్లాంటి చెత్త నాకెప్పుడూ చెప్ప లేదు." కోపంతో శారద తీవ్రంగ అన్నది "ఏమిటి నువ్వనేది? ఆ ఆకులు రాలి పోవటానికి నువ్వు కోలుకోటానికీ సంబంధమేమిటి? ఇంతకు మునుపు నువ్వా ద్రాక్షను ఎంత ఇదిగా ప్రేమించే దానివి? తెలివి తక్కువ ఆలోచనలేం పెట్టుకోకు. నిజానికి డాక్టరు కూడ ఏమన్నారంటే పది ఛాన్సులకి ఒక్క ఛాన్సు మాత్రం ఉందన్నారు అయితే మట్టుకు? ఇన్ని కారులు అటు ఇటు దూసుకు పోతుంటే ఈ నగరపు రోడ్ల మీద గాని, లేక ఈ రోజుల్లో కొత్తగా నిర్మించిన ఒక భవనం పక్కనుంచిగాని నడుస్తున్నప్పటి జీవితావకాశాల కంటే ఇది ఎక్కువేనే! ఇంకేమీ మాట్లాడక, ఒక టేబిలెట్ వేసుకుని నిద్రపోవటానికి ప్రయత్నించు... నేను బొమ్మ పూర్తి చేస్తేనే గాని నా పొట్ట కూటికి, నీకు బ్రెడ్డుకి వాటికీ కాస్త డబ్బులు దొరకవు...."

"ఇంక నాకు బ్రెడ్డూ వద్దు. పాడూ వద్దు," అన్నది రజని ఇంకా కిటికీవేపే దృష్టి వుంచి. "మళ్ళీ ఇంకొకటి పడింది. ...లేదు నాకింకే బ్రెడ్డూ, సూపులూ వద్దు ఇప్పుడు నాలుగే ఆకులు చీకటి పడేలోపున ఆ ఆఖరుది కూడ పడిపోతే చూస్తాను. ఆ తర్వాత నేను కూడ .."

"రజనీ, ప్లీజ్!" శారద మంచం మీదకు వంగి వున్నది మిత్రురాలి భుజాలు రెండూ పట్టుకుని ప్రాధేయ పూర్వకంగా చూసింది. "నా మీద ఒట్టేసున్నాను. కాసేపు నేనా బొమ్మ పూర్తి చేసేంతవరకు కిటికీవేపు చూడటం మానేసి కళ్ళు మూసుకుని పడుకోవూ? మంచిదానివిగా? రేపు సాయంత్రానికల్లా బొమ్మను వాళ్ళకు అందజేయాలన్న సంగతి నీకూ తెలుసాయె...లేదంటావా కిటికీ మూసేస్తాను.

"అవతలి గదిలో గీసుకోరాదా?" నిర్దయగా అడిగింది రజని.

చెప్పినా నే నిక్కడ్నుంచి మాత్రం కదలను. మొండిగ అన్నది శారద: "అంతే కాదు. నువ్వా ఆకులవేపు చూడటం కూడ నేనొప్పుకోను"

"సరే అయితే." నిశ్వసించింది రజని. చిన్నగ కళ్ళు మూసుకుని అన్నది "నీ పని పూర్తికాగానే చెప్పు ఎందుకంటే నేనా ఆఖరి ఆకు పడిపోవటం మట్టుకు తప్పకుండ చూడాలి. ఇట్లా ఎదురు చూడటము, ఆలోచించటమూ అంతా అలసిపోయాను. నేను కూడా అన్నిటి మీద పట్టులు సడలించుకుని ఆ ఆకుల్లాగే అలా.అలా క్రిందికి ప్రయాణం చేయాలనిపిస్తోంది."



"ముందయితే నువ్వు నిద్రపోవటానికి ప్రయత్నించు. నేనీలోపు క్రిందికి వెళ్ళి రామస్వామి తాతని మేడలోకి పిల్చుకు వస్తాను. ఇప్పుడే వచ్చేస్తాను. నే వచ్చేవరకు మాత్రం కదలకూ...."

కిటికీ రెక్కలు మూసేసి క్రిందికి పరిగెత్తింది శారద.

రామస్వామి తాతకు అరవై ఏళ్ళుంటాయి. ఎత్తైన ఒళ్ళు. తెల్లటి వెంట్రుకలతో వరులాకాలపు గడ్డం కళ్ళ చివర్ల. చెంపల పక్క చర్మం గీతలు పడి ఉంది. కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది ఆయన మొహంలో. క్రింద వాటాలో ఒక గదిలో ఉంటున్నాడు. ఆయన కూడా ఒక ఆర్టిస్టు. కాని పేరులయిన ఆర్టిస్టు నలభైయేళ్ళ క్రితమనగా కుంచె పట్టాడు. కాని ఒర్థు కన్య వస్త్రపు అంచునైనా తాకలేక పోయాడు. ఎప్పుడూ ఏదో కళాఖండాన్ని గీయబోతున్న వాడిలా కనిపిస్తాడు, మాట్లాడతాడు. కాని ఇంతవరకు దాని కాయన ప్రారంభమే చెయ్యలేదు. ఎప్పుడన్నా ఏదన్నా చిత్రించటానికి ప్రయత్నిస్తాడు కాని ఏ సగమో అయాక అసంతృప్తితో గబాల్న కాన్వాసును చింపేస్తాడు. ఎట్లా సంపాదిస్తాడో, ఏమి సంపాదిస్తాడో, ఎప్పుడు తింటాడో ఎవరికీ తెలియదు. పగలల్లా బయటికి పోయి సాయంత్రానికి ఇంటికి చేరుకుంటాడు. రాత్రి ప్రొద్దుపోయే వరకు తెగ తాగి కిల్లాయి పాటలు పాడుతాడు. మెత్తగా ఉండే మనుషులంటే ఆయనకు అస్సలు సహనంలేదు. అట్లా ఉండకద్దని వాళ్ళని కోప్పడతాడు. ఆ వీధిలో వాళ్ళు ఆయన్ని ఆ అర ఆర్టిస్టుని కిద్దరికీ గార్డియన్ క్రింద భావిస్తుంటారు.

ఆ రోజాయన ఇంటిపద్దే ఉన్నాడు.

ఆ సంగతి శారదకు తెలుసు. ఆమె వెళ్ళే సరికి చాపమీద మత్తుగ పడుకుని ఉన్నాడాయన. గదిలో ఒక మూల ఈజెల్ మీద కాన్వాసు అమర్చి ఉంది. తనమీద యజమాని గీయబోయే కళాఖండం కోసం ఇరవై ఏళ్ళ నుంచి ఎదురు చూస్తోందా కాన్వాసు గుడ్డ.

రజని చపలత్వాన్ని గురించి శారద ఆయనకు అంతా చెప్పింది. 'కయ్' మన్నాడాయన.

"నాన్‌సెన్స్! రాలి పోబోయే ఒక ఆకుతో తన చావును ముడి పెట్టే వాళ్ళు కూడ ఉన్నారా ఈ లోకంలో? నేనింత వరకు వినలేదు. ముందు నువ్వవతలకిపో. నీకవలె నేను మోడల్‌గా కూర్చోనే కూర్చోను అట్లాంటి చెత్త అభిప్రాయాన్ని నువ్వవలె ఆమె మనస్సులోకి ఎలా రానిచ్చావో నాకర్థం కావటం లేదు. ఛా. ఛా. పిచ్చి రజనీ!'

"అదసలే బలహీనంగా వుంది" శారద అన్నది. "జ్వర తీవ్రత ఆమెలో ఈ చిత్ర భావాలన్నింటినీ ఆవేశ పెట్టింది." సరేలే కాతా నువ్వు నాకు పోజుకు కూర్చో పోతే పోయావు గాని ఒక సంగతి చెప్ప మంటావా?— నువ్వొట్టి దొంగ మూండావాడివి—"

ఇంతెత్తున లేచాడాయన.

"మొత్తానికి అడవాళ్ళవని పించావు! పోజుకు కూర్చోనని ఎవరన్నారిక్కడ? పద. వెళ్దాం. అర గంటనుంచి నేను నీ కోసం కాసుకు కూర్చుంటే నువ్వేమో ఇప్పుడిట్లా అంటావా? ఛా ఛా. జబ్బులో ఉన్న రజనీ అమ్మడు లాంటి వాళ్ళకు ఇది సరైన స్థలమే కాదు. ముందు నా కళాఖండం పూర్తి కానీ మిమ్మల్నిద్దరినీ మంచి ఇంట్లోకి తీసుకువెళతాను.

వాళ్ళిద్దరూ పైకి వెళ్ళేసరికి రజని నిద్రపోతోంది. శారద చప్పుడు కాకుండా కిటికీ తలుపులు తెరచింది. ఇద్దరూ బెరుకుగా కిటికీలోంచి బయటికి చూశారు. ద్రాక్షతీగవేపు. వెంటనే మౌనంగా ఒకళ్ళ మొహం ఒకరు చూసుకున్నారు. చల్లగ చిన్నగ వర్షం కురుస్తోంది.

కావి రంగు దుస్తుల్లో రామస్వామి తాత స్టూలు మీద కూర్చున్నాడు మోడల్ కోసరం.

మర్నాడుదయం నిద్రలేస్తూనే శారద రజనీ వేపు చూసింది. కళ్ళు తెరుచుకుని ఉంది. మబ్బుగా ఆమె కిటికీ వేపే చూస్తోంది.

"కిటికీ తెరువు. నేను చూడాలి ఆజ్ఞాపించింది." రజనీ బలహీన స్వరంతో.

భయం భయంగా వెళ్ళి రెక్కలు తెరిచింది శారద.

కాని...రాత్రి పొడుగునా కురిసిన అంత పెద్ద వర్షానికి అంతటి విసురు గాలులకీ తట్టుకుని ఇంకా ఒక్క ఆకు వ్రేలాడుతోంది గోడమీద. అది ఆ ద్రాక్ష తీగ మొత్తానికే ఆఖరుది. కాడ చివర ఇంకా ముదురు ఆకు పచ్చ రంగులను. అంపపు అంచుల వంటి చుట్టూ ఆకులు క్షీణించిన పసుపు రంగులోను ఉంది. అది భూమికి ఇరవై అడుగుల ఎత్తున ధైర్యంగా గోడని పట్టుకు వ్రేలాడుతోంది.

"ఆఖరుది అదే." రజనీ అన్నది. రాత్రే గాలి పోతుందనుకున్నాను. అంత పెద్ద గాలి! అవును. వింటూనే ఉన్నాను. అను కున్నాను కూడా. కాని... అప్పుడే

ఏమయిందిలే. ఇవ్వాళెటూ అది రాలిపోవటం తప్పదు. దాన్తోనే నేనుకూడా...."

విల విలలాడింది శారద.

"రజనీ. రజనీ. నీసంగతి ఆలోచించక పోతే పోతూవుగాని. నా సంగతన్నా ఆలోచించు. నేనేం కాను?"

కాని రజని మాట్లాడలేదు. ప్రపంచంలో కెల్లా సంబరిని అన దగ్గది బహుశా నిస్టీతో కూడుకున్న ఆ సుదీర్ఘ ప్రయాణానికి తయారుకాబోతున్న 'ఆత్మ' కావొచ్చు స్నేహము. మిగతా ఈ భూమి మీద తనకున్న సంబంధాలన్నిటి నీళ్ళు వదులుతున్న కొద్దీ రజనీలోని చపల భావాలు బలపడ సాగాయి.

పగలు గడిచిపోయింది. సాయంత్రపు ఆ సంధ్య వెలుగులో కూడ ఆ ఆకు అలా గోడను పట్టుకు వ్రేలాడుతుండటాన్ని వాళ్ళు చూడగలిగారు. రాత్రి కాగానే మళ్ళా బలాన్ని పుంజుకుంది. వర్షం విసురుగా కిటికీని బాదసాగింది.

తెల్లారింది. కిటికీ రెక్కలు తెరవమని రజని నిర్దయగా శారదను శాసించింది.

ఆ ఆకు ఇంకా అక్కడ అట్లాగే వుంది.

చాలాసేపు దానివేపే చూస్తూ పడుకుంది రజనీ. హటాత్తుగా ఏదో గుర్తొచ్చిన దానిలా, కుంపటితో కుస్తీ పడుతున్న శారదను చప్పున కేకేసింది.

"నేను నిజంగా చాలా చెడ్డదాన్ని శారూ!" మిత్రురాలు దగ్గరకు వచ్చాక అన్నది. "ఏదో అదృశ్య శక్తి నాకు బుద్ధి చెప్పటానికి గాను. ఆ ఆకును అలా పడిపోకుండా ఉంచిందనుకుంటా. లేకపోతే ఏమిటి, చనిపోవాలని కోరుకోవటం పాపం కదూ? సరే. నాకొక్కస్త రొట్టె ముక్క తెచ్చిపెట్టు. పాలుకూడా. డబ్బులుంటే ఏవైన పళ్లు తెప్పించు. ఇంకా.... లేదు. ముందా అద్దానిటు పట్రా. నా వీపు వెనక కొద్దిగా దిళ్ళు పేర్చు. నువ్వు వంట ఎలా చేస్తున్నావో చూడాలి."

ఒక గంట గడిచాక మళ్ళా అన్నది ఆమె.

శారూ! ఎప్పటికైనా ఒక రోజున హిమాలయాన్ని పెయింటు చేయగలననుకుంటా."

మధ్యాహ్నం డాక్టరు వచ్చాడు. ఆయన వెళ్ళిపోయేప్పుడు వెనకే శారద కూడ మెట్లవరకు నడిచింది.

"బాగుంది." ఆయన అన్నారక్కడ "మంచిగ పరిచర్యలు చేస్తే గెలుస్తావు. ఇక వెళ్తానమ్మాయ్. కింద యింకో పేషెంటును చూడాలి."

ఆయన కదుల్తుండగా శారద అడిగింది.

"కింద పేషెంటు ఎవరు డాక్టరు గారూ?"

"రామస్వామి అని ఎవరో ఒకముసలాయన. మీలాగే ఏదో ఆర్టిస్టనుకుంటా. పాపం అతనికీ న్యుమోనియా. అది కూడ కాస్త తీవ్రంగానే మీద పడింది. అసలే నీరసపు మనిషి నాకయితే నమ్మకం లేదు. ఏదో పాపం సౌకర్యం కోసం అన్నట్లు హాస్పిటల్ కు చేర్పిస్తున్నాను గాని."

మర్నాడు డాక్టరు శారదతో అన్నాడు.

"గుడ్! గెలిచావు. ఇంక అంతా నీ మీద ఆధారపడి వుంది. మంచి

తింది. చక్కటి నర్సింగు - అంతే."

ఆ మధ్యాహ్నానికి రజని మొహం కాస్త కళగా కనిపించింది. 'ఫిల్మ్‌ఫేర్' పేజీలు తిరగేస్తూ తీరికగా మంచంమీద పడుకుని ఉందామె. అదే సమయాన శారద ఏదో చెప్పటానికన్నట్లు వచ్చి ఆమె పక్కనే మంచం పట్టెమీద కూర్చుంది.

"నీకు చెప్పాల్సిన ముఖ్యమైన విషయమొకటి ఉంది రజనీ." నిదానంగా అన్నది శారద.

చెప్పమన్నట్లు పుస్తకంలోంచి దృష్టి మరల్చి పైకి చూసింది రజని.

"పాపం రామస్వామి తాత ఇంతకు ముందే చనిపోయాడు. న్యుమోనియా వల్ల రెండు రోజులు మాత్రమే జబ్బుతో తీసుకున్నాడు. ఆ మొదటి రోజు తెల్లవారుఝామున తాత గదిలోనుండి మూలుగులు వినిపిస్తే ఇంటాయన ఏమిటా అని వెళ్ళి చూశాడట. ఏముంది! ముసలాయన గది మధ్య నిస్సహాయంగా పడి వున్నాడు. తడిసి ముద్దయిన ఆయన బట్టలు, బూట్లు, ఇంకా అలాగే వంటికి అంటి పెట్టుకుని ఉన్నాయట. అంత ఘోరమైన రాత్రిలో ఈయన ఎక్కడికి వెళ్ళాడా అని ఆశ్చర్యపోయాడట. తాత పక్కనే కొంచెం అస్థిరంగా ఇంకా కొదిగా వెలుగుతున్న ఒక లాంతరు. విచ్చిన ఒకటి, చిందర వందరగా పడి వున్న కొద్ది బ్రష్‌లు. ఆకు పచ్చ, పసుపు పచ్చ, రంగులు కలిపి వున్న ఒక 'పాలెట్' అవీ కనిపించాయట. అదిగో, కిటికీలోంచి అటు చూడు. గోడమీద ఆ ఆకు! ఎంత పెద్దగాలి వీచినా అది ఎందుకని కదలనైనా కదలలేదనుకుంటున్నావు? నీ కోసమే. రామస్వామి తాత ఆ ఆకు రాలిన నాటి రాత్రే దాన్నక్కడు పెయింటు చేశాడు. బతికున్న రోజుల్లో ఆయన చెబుతూండే కళాఖండం అదే!"

(ఓ హెన్రీ కథ ఆధారం.)

మతిమరుపుగురించి ఓ పత్రికవారు పోటీ ఏర్పరిచారు.

మతిమరుపు కారణంచేత ఆ పత్రికవారు అనుకున్న సంచికలో "మతిమరపు' వ్యాసం ప్రచురించలేదు.

"మతిమరుపు" వ్యాసరచనలో పాల్గొన్న ఓ రచయిత గడువుతేదీ తర్వాత మరోపత్రిక చిరునామాకు పంపించాడు ఆ పత్రికవారు "మతిమరపు" వ్యాసపోటీ ఏర్పాటు చేసిన పత్రికాధిపతులకుపంపించారు. ఈ రచయిత వ్యాసాన్ని ప్రచురించారు. చివర గమనికలో "రచయిత తన పూర్తి పేరు మతిమరుపువేత సరిగా వ్రాయలేదు. వారువ్రాసిన విధంగా పేరు ఇలా ఉన్నది. పి. వీరవెంకట....వారిని తమ పూర్తి పేరు తెలియచేయవలసినదిగా కోరుతున్నాము."

డి. ఉదయభాస్కర్ (మద్రాసు)